ప్రజల ఇంటికే అధికార యంత్రాంగం

- సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం
- అర్హత గల ప్రతిపక్షాల వారికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- గంభీరంలో రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభం



వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ ప్రజలు తిరిగే రోజులు పోయాయని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస రావు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారులనే ఇంటింటికీ పంపించి, పరిష్కార మార్గాలు చూపిస్తున్నారన్నారు. ఆనందపురం మండలంలోని గంభీరంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, 17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత గలవారు లక్షలాదిమంది ఉన్నా.. టీడీపీ పాలనలో అర్హతలు గుర్తించకుండా కమీషన్లు తీసుకొని జన్మభూమి కమిటీ పేరుతో వారికి నచ్చిన వారికే పథకాలను అమలు చేసేవారన్నారు. అలాంటి పరిస్థితిని చక్కదిద్ది, అన్ని వర్గాల ప్రజలకు రాజకీయాలకతీతంగా పథకాలు అందించాలనే ఉద్దేశంతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను మన సీఎం ప్రవేశపెట్టారన్నారు. దీంతో సమాజంలో సమూల మార్పులు చోటు చేసుకుని, దేశంలోనే జగన్‌మోహన్ రెడ్డి పాలన ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన టీడీపీ నాయకులు పాలన చేతకాక ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని కోరారు. పొరపాటున మరలా టీడీపీకి ఓటేస్తే వలంటీర్, సచివాలయ వ్యవస్థను రద్దు చేసి మరలా జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకుంటారని హితవు పలికారు.

ముఖ్యంగా రైతాంగానికి అన్ని రకాలుగా సహాయపడడానికి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వాటి ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, కల్తీ లేని ఎరువులు సకాలంలో అందుతున్నాయని అన్నారు. వైద్యపరంగా వెల్‌నెస్ సెంటర్లు స్థానికంగా ఉత్తమ సేవలు అందిస్తున్నాయని, అవి పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. వివిధ రకాల పరీక్షలతో పాటు ఉచితంగా మందులను అందిస్తున్నారని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. గంభీరం పంచాయతీలో 14 వందల కుటుంబాలు ఉండగా నాలుగేళ్లలో రూ.11.58 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు జరిపామని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీలు బొట్టా ధనలక్ష్మి, పాండ్రింకి శ్రీను, ఎంపీడీవో అడపా లవరాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి కోరాడ శైలజ, వ్యవసాయశాఖ ఏడీ విజయ్‌ప్రసాద్, వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, నాయకులు బొట్టా రామకృష్ణ, ఉప్పాడ సూరిబాబు, బోయి వెంకటరమణ, పిన్నింటి వెంకటరమణ, లెంక రాంబాబు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మారికవలస రాజీవ్ గృహకల్ప వద్ద గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పీఎం పాలెం: అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మధురవాడ జోన్ మారికవలస రాజీవ్ గృహకల్ప వద్ద నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు తిరిగి జగనన్నకే పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నూరుశాతం సంక్షేమ పథకాలు పారదర్శకంగా లబ్ధిదారులకు చేరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 75వ సచివాలయ పరిధిలోని 11 క్లస్టర్లలో 33 బ్లాకులలో ఆయన ప్రజల సమస్యలు విన్నారు.

తక్షణం వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ కనకమహలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిన హనుమంతరావు, జగన్నాథ సన్యాసిరెడ్డి, వాండ్రాసి రవికుమార్, పోతిన సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో మహిళకు గాయాలు

తగరపువలస: భీమిలి జోన్ రెండోవార్డు జీరుపేటలో శుక్రవారం వీధికుక్కలు చిల్ల పోలితల్లి అనే మహిళపై దాడి చేసి, గాయపరిచాయి. దీంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఇటీవల జీరుపేటలో పిచ్చికుక్కలు తరచూ స్థానికులపై దాడులకు దిగుతున్నాయి. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

12 మంది కానిస్టేబుళ్లకు వీడ్కోలు

పద్మనాభం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పని చేసి బదిలీ అయిన 12 మంది కానిస్టేబుళ్లకు శుక్రవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. 10 మంది లా అండ్ ఆర్డర్, ఇద్దరు క్రైం కానిస్టేబుళ్లకు వీడ్కోలు పలికారు. సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ బదిలీ అయిన కానిస్టేబుళ్ల సేవలను కొనియాడారు. ఎస్‌ఐ రాము, ఏఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం

పద్మనాభం: పచ్చిరొట్ట ఎరువులు వాడడం ద్వారా భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం తెలిపారు. పద్మనాభం గ్రామంలో మండల వ్యవసాయ సలహా మండల సమావేశం శుక్రవారం జరిగింది. ఇప్పటికే ఆర్బీకేల్లో పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సూరినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పశు వైద్యాధికారి కె.మహేష్, అధికారులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సేవాభావం అవసరం

- భీమిలి ఆస్పత్రి అభివృద్ధికి సీఎం ప్రత్యేక శ్రద్ధ
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమిలి: వైద్యులు, సిబ్బంది తమ విధులను అంకితభావంతో నిర్వర్తించాల్సిన అవసరం ఉందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్(ప్రభుత్వ ఆస్పత్రి)లో శుక్రవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ హోదాలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో రూ.3.28 కోట్లు మంజూరు చేయడంతో అన్ని సదుపాయాలతో కూడిన ఆస్పత్రి కొత్త భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇప్పుడు రోగులు అందరికి ఎంతో సదుపాయంగా ఉందని, కొత్తగా పలువురు వైద్య నిపుణులు నియామకమయ్యారని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో ఇదే పెద్ద ఆస్పత్రి కావడంతో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, వారికి మెరుగైన సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులు ప్రసవాలు చేయించుకుంటే ప్రభుత్వం రూ.5 వేలు ప్రోత్సాహకం అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్స్ రే ప్లాంట్, ఆర్వో ప్లాంట్, ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన సామగ్రి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫణికుమార్ చేసిన ప్రతిపాదనలకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఆమోదం తెలిపి, త్వరలో సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కిషోర్, భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, అభివృద్ధి కమిటీ సభ్యులు ఎర్నింటి అచ్చిబాబు, మైలపల్లి లక్ష్మణరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అర్చకుల తరఫున ధన్యవాదాలు



ఆర్.సింగరాచార్యులు

భీమిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకులకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నందుకు గాను ఉత్తరాంధ్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు రొంపిచర్ల సింగరాచార్యులు ధన్యవాదాలు తెలియచేశారు. భీమిలిలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా అర్చకులకు న్యాయం జరిగే విధంగా ఇటీవల దేవదాయశాఖ వివరాలు సేకరిస్తోందన్నారు. దీనిపై త్వరలో అర్చకుల సంఘాలతో సమావేశమై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతామన్నారు.

ఆరోగ్య సంరక్షణపై గర్భిణులకు అవగాహన

తగరపువలస: ప్రధానమంత్రి సురక్షిత్ మంత్రిత్వ అభియాన్ పథకంలో భాగంగా భీమిలి మండలం తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ప్రధాన వైద్యుడు మల్లికార్జునరా వు గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. మందులు పంపిణీ చేశా రు. సాధారణ ప్రసవాలు జరిగేందుకు ముందు నుంచి తగు వ్యాయామాలు చేయాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్యుని విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న శంకరరావు

పద్మనాభం: మండలంలోని విజయానందపురంలో ఎరుకుల కులస్తుల ఆరాధ్య దైవం ఏకలవ్యుని విగ్రహ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నాయకుడు సారిక శంకరరావు, ఏపీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పాలపల్లి శ్రీనివాస రావు శుక్రవారం భూమి పూజ చేశారు. పాలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏకలవ్యుని విగ్రహాన్ని రాష్ట్ర నాయకత్వం తరఫున ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గేదెల లక్ష్మణరావు, గేదెల సత్తిబాబు, గేదెల సత్యం, దాసరి శంకరరావు, కొండ్రు రమణ, గొర్లె సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మిద్దె తోటను పరిశీలిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

కొమ్మాది: ప్రతి ఇంటిని వ్యవసాయ క్షేత్రంగా మార్చుకుని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి కోరారు. శుక్రవారం 7వ వార్డులోని టైలర్స్ కాలనీలో జానూస్ నేచర్ మిద్దె తోటను ఆమె సందర్శించారు. 60 గజాల మిద్దె మీద అనేక రకాల పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, ఔషధ మొక్కలు పెంచుతున్న ఝాన్సీని మేయర్ అభినందించారు. మిద్దెలు, కాంపౌండ్ పరిసరాల్లో మొక్కలు పెంచడం ద్వారా కాలుష్యం నియంత్రించవచ్చునని మేయర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వడివడిగా ఎర్ర చెరువు పూడ్చివేత!

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు ఆదర్శనగర్ సచివాలయం ముందు ఉన్న ఎర్ర చెరువును స్థానికులు వడివడిగా గ్రావెల్‌తో పూడ్చుతున్నారు. ఆదర్శనగర్-నమ్మివానిపేట రహదారిని ఆనుకుని 2.02 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును ఇప్పటికే పడమర, దక్షిణ మార్గాల వైపు వెయ్యి గజాలకు పైగా పూడ్చేశారు. చెరువు మిగిలి న మార్గాలలో జిరాయితీ భూముల పేరుతో రాత్రివేళ పదుల సంఖ్యలో లారీలతో గ్రావెల్‌ను తరలిస్తూ చదును చేస్తున్నారు. ఈ మేరకు చెరువు విస్తీర్ణం ఉత్తర దిశలో గజాల వంతున తగ్గిపోతుంది. పగటి వేళ సచివాలయ సిబ్బంది అడ్డుకుంటున్నా.. వారు లేని సమయం చూసి గ్రావెల్‌తో చెరువును కొద్ది కొద్దిగా పూడ్చుకుంటూ వెళ్తున్నారు. ఇక్కడ రెండేసి ఎకరాలలో విస్తరించి ఉన్న నల్ల కోనేరు, ఎర్ర చెరువు స్థలాలను సర్వే చేసి కబ్జాకు గురి కాకుండా కంచెలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని చుట్టుపక్కల ప్రజలు కోరుతున్నారు. చెరువు పూడిక విషయాన్ని భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ దృష్టికి తీసుకురాగా.. శనివారం పరిశీలిస్తామన్నారు.



ఆదర్శనగర్ సచివాలయం ముందు 500 గజాల వరకు ఎర్ర చెరువును పూడ్చిన దృశ్యం

క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న సర్పంచ్ చందక లక్ష్మి

ఆనందపురం : ఆనందపురం పంచాయతీ ఎగువ యాతపేటలో అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితులకు సర్పంచ్ చందక లక్ష్మి సాయం అందజేశారు. కొలుసు కృష్ణమ్మ ఇల్లు ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి పోయింది. ఈ మేరకు సర్పంచ్ లక్ష్మి రూ.2వేలు నగదు, బియ్యం ఇతర నిత్యావసర సరకులను అందజేశారు. ప్రభుత్వపరంగా ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు షిణగం రామారావు, షిణగం చిన్న రామారావు, చందక శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెంలో శుక్రవారం ఉపాధి హామీ పనులను సర్పంచ్ పాట్నూరు ఛాయాగౌతమి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.8 లక్షలతో చేపట్టనున్న ఈ పనుల్లో భాగంగా నది గట్టును పటిష్టం చేయనున్నట్టు తెలిపారు. పంచాయతీలో 250 మంది వరకు కూలీలు 4 నుంచి 5 వారాల వరకు ఈ పనిలో ఉపాధి పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, వీఆర్పీ పల్లా మురళి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మధురవాడ: ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్లాప్ వెహికల్ డ్రైవర్లకు రూ. 18,500 ఇవ్వాలని మున్సిపల్ యూనియన్ జోన్-2 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ శేషుబాబు, ఎస్.రామప్పడు డిమాండ్ చేశారు. ఈ నెల 19 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మె పోస్టర్‌ను స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయం అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మికులు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు నాగరాజు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

పద్మనాభం: పాట్నూరులోని కోదండ రామస్వామి ఆలయంలో ఈ నెల పది నుంచి 12వ తేదీ వరకు గోదా రంగ నాథుల ఉత్సవ విగ్రహాల ప్రతిష్ట, ధ్వజ స్తంభ ప్రతిష్ట ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో నానాబీ బాబు ప్రకటనలో తెలిపారు. 10, 11 తేదీల్లో విశేష పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. 12న ధ్వజ స్తంభ ప్రతిష్ట, గోదా రంగనాథుల ఉత్స వ విగ్రహాల ప్రతిష్ట నిర్వహించనున్నట్టు తెలిపారు.

570 మార్కులు దాటిన విద్యార్థులకు నగదు బహుమతి

తగరపువలస: ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్షలలో భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాలలో 570 కంటే ఎక్కువ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భీమిలి సన్ స్కూల్ అధినేత కైతపల్లి శ్రీనివాసరావు నగదు ప్రోత్సాహకాలు అందించనున్నారు. విద్యార్థులు ఆధార్ కార్డు, హాల్ టిక్కెట్, మార్కుల జాబితాల జిరాక్సులతో ఈ నెల 15లోగా సన్ స్కూల్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 98664 41140లో సంప్రదించాలని కోరారు.

రైతులకు పరామర్శ

కొమ్మాది: కె.నగరపాలెం నర్సింహనగర్ వద్ద గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. సుమారు రూ. 40 వేల ఆస్తి నష్టం సంభవించింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు శుక్రవారం సంఘటన స్థలం చేరుకుని బాధితులను పరామర్శించారు. తక్షణ సహాయంగా బాధితులు బాడిదబోయిన రాంబాబు, గరికిన అప్పలరాజుకు ఆయన 10 వేల నగదు అందజేశారు.